సాక్షి కరీంనగర్

బుధవారం | 8 | మే | 2024

ప్రచారానికి మొగులు గుబులు

ఎన్నికల ప్రచారంలో నిండా మునిగిన నాయకులను ప్రకృతి పగబట్టినట్లే ఉంది. నిన్నటిదాకా ఎండలతో తల్లడిల్లిన నాయకులు సరిగా ప్రచారం చేయలేకపోగా.. ప్రస్తుతం ఆకస్మిక వానలతో దాదాపు అదే పరిస్థితి నెలకొంది.

IIలో▸

న్యూస్‌రీల్

కాంగ్రెస్, బీజేపీ నేతలను నమ్మొద్దు

- బీఆర్‌ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్‌తోనే అభివృద్ధి సాధ్యం
- మాజీ హోం మంత్రి మహమూద్ అలీ



ప్రచారం చేస్తున్న మాజీ హోం మంత్రి మహమూద్ అలీ, అభ్యర్థి వినోద్‌కుమార్

కరీంనగర్: కాంగ్రెస్, బీజేపీ నేతల మాయమాటలు నమ్మొద్దని, కరీంనగర్ ఎంపీగా బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ గెలుపుతోనే అభివృద్ధి సాధ్యమని, ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ హోం మంత్రి మహమూద్ అలీ అన్నారు. మంగళవారం కరీంనగర్‌లోని 43, 45వ డివిజన్ల పరిధి సవరన్ స్ట్రీట్, డాక్టర్ స్ట్రీట్ తదితర ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గతంలో ఎన్నడూ జరగని అభివృద్ధి బీఆర్ఎస్ హయాంలోనే జరిగిందని తెలిపారు. పదేళ్లల్లో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత తమ పార్టీకే దక్కుతుందని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు చల్ల హరిశంకర్, నాయకులు అక్బర్ హుస్సేన్, జమీలొద్దీన్, యూసుఫ్, సయ్యద్ నయీం, నవాజ్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు



పార్టీలో చేరినవారితో బండి సంజయ్

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ నగరపాలక సంస్థకు చెందిన ఇద్దరు బీఆర్ఎస్ కార్పొరేటర్లు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. 50వ డివిజన్ కార్పొరేటర్ కొలిపాక అంజయ్య, 46వ డివిజన్ కార్పొరేటర్ వంగల శ్రీదేవి–పవన్ మంగళవారం ఎంపీ కార్యాలయంలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ సమక్షంలో కాషాయ కండువా కప్పుకున్నారు. అలాగే బీఆర్ఎస్‌కు చెందిన మాజీ జెడ్పీటీసీ ఎడ్ల శ్రీనివాస్, 47వ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షురాలు అన్నపూర్ణ, ఆరెపల్లి మాజీ సర్పంచ్ కాశెట్టి రాజిరెడ్డి, మాజీ ఎంపీటీసీ పాదం రాజు సహా వందలాది బీఆర్ఎస్ నేతలు బీజేపీలో చేరారు. సిరిసిల్ల పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్, సీనియర్ నేత ఎర్రం వెంకట్రాజంతో పాటు సుమారు 50 మంది బీఆర్ఎస్ నేతలు సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరారు. కరీంనగర్ పట్టణానికి చెందిన ఆర్యవైశ్య ప్రముఖులు శ్రీనివాస్, జిల్లా జగదీశ్, కాలువల శ్రీధర్, నీలికొండ సురేశ్, పండకంటి సతీశ్, నార్ల వేణు, పెద్ది అమర్, ఎలుగూరి రవి బీజేపీ గూటికి చేరారు.

ఉక్కపోతకు ఉపశమనం

కరీంనగర్ అర్బన్: భానుడి ప్రతాపానికి ఉపశమనం లభించింది. మంగళవారం సాయంత్రం కురిసిన అకాల వర్షంతో ఎండ వేడిమి నుంచి ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. కరీంనగర్, హుజూరాబాద్, మానకొండూరు, చొప్పదండి, గంగాధర, గన్నేరువరం, చిగురుమామిడి, శంకరపట్నం మండలాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. రాళ్లవాన పడటంతో పాటు ఈదురుగాలులు ఆందోళన రేపాయి. పలు చోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడగా వాహనాలు దెబ్బతిన్నాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని రైతుల బాధ వర్ణనాతీతం. సకలవర్గాలు సంతోషపడితే రైతులు పడరాని పాట్లు పడ్డారు. పలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్ల నత్తనడకన సాగుతుండటంతో మిల్లులకు చేర్చడంలో జాప్యం జరుగుతోంది. దీంతో చొప్పదండి, గన్నేరువరం ప్రాంతాల్లో కుప్పలు తెప్పలుగా ధాన్యం పేరుకుపోగా వర్షానికి తడిసిపోయింది.

రైతు కష్టం..వర్షార్పణం

- ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతో రైతన్న ఉక్కిరిబిక్కిరి
- కొనుగోలు కేంద్రాల్లో తడిసి ముద్దయిన ధాన్యం
- విరిగిపడిన విద్యుత్ స్తంభాలు



చిగురుమామిడి: సీతారాంపూర్‌లో విరిగిపడిన విద్యుత్ స్తంభం



చొప్పదండి: మార్కెట్‌యార్డులో నీటినుంచి ధాన్యం ఎత్తుతున్న మహిళా రైతు

చొప్పదండి/కరీంనగర్‌రూరల్/గన్నేరువరం/గంగాధర/సైదాపూర్/చిగురుమామిడి/కొత్తపల్లి/శంకరపట్నం/మానకొండూర్: ఆరుగాలం శ్రమ నీటిపాలయింది. ప్రకృతి ప్రకోపానికి అన్నదాత ఆగమయ్యాడు. జిల్లావ్యాప్తంగా మంగళవారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన గాలివాన బీభత్సం సృష్టించగా పలుచోట్ల ధాన్యం తడిసిముద్దయింది. మామిడితోటల్లో కాయలు నేలరాలాయి.

- చొప్పదండి మండలంలో వాననీటికి వ్యవసాయ మార్కెట్‌లో వడ్లు కొట్టుకుపోయాయి. గుమ్లాపూర్‌లో ఇరుగురాల మహేందర్ మునగతోట నేలవాలింది.
- కరీంనగర్‌రూరల్ మండలం జూబ్లీనగర్, చెర్లభూత్కూర్, దుర్శేడ్, నగునూరు, బొమ్మకల్ కేంద్రాల్లో ధాన్యం తడిచింది. ఈదురుగాలులకు బొమ్మకల్, చామనపల్లిలో స్తంభాలు విరిగిపడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయమేర్పడింది.
- గన్నేరువరం మండలం యాస్వాడ, పలు గ్రామాల్లో కోతకు వచ్చిన వరి పంట నేలవాలింది. పారువెల్ల, ఖాసీంపేట, మాదాపూర్, హన్మాజిపల్లె, పీచుపల్లి, జంగపల్లి, గునుకులకొండాపూర్, గుండ్లపల్లి, మైలారం గ్రామాల్లో మామిడి కాయలు రాలిపోయాయి.
- గంగాధర మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం కొట్టుకుపోయింది.
- సైదాపూర్ మండలంలో పలుచోట్ల కరెంట్ స్తంభాలు ఒరిగాయి. సర్వాయిపేటలో రేకుల షెడ్లు ధ్వంసమయ్యాయి. బొమ్మకల్‌లో మామిడితోటలు దెబ్బతిన్నాయి. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిచింది.
- చిగురుమామిడి మండలం సీతారాంపూర్ ఎస్సీకాలనీలో ఐదు, బీసీ కాలనీలో ఒక విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఒక స్తంభం సెలూన్ షాపుపై పడటంతో పూర్తిగా ధ్వంసమైంది. లంబాడిపల్లి, బొమ్మనపల్లి, రేకొండ, సుందరగిరితో పాటు పలుగ్రామాల్లో భారీ వృక్షాలు నేలకొరిగాయి. పీచుపల్లి, బొమ్మనపల్లి, ఓగులాపూర్, ఉల్లంపల్లి గ్రామాల్లో మామిడి కాయలు నేలరాలాయి. పలుచోట్ల కొనుగోలు కేంద్రాల్లో వర్షపు నీరు నిలిచింది.
- టీఎస్ఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ పరిధిలో పలు చోట్ల విద్యుత్ తీగలపై చెట్లు పడటంతో కరెంట్ సరఫరా నిలిచిపోయింది. 33 కేవీ కొత్తపల్లి ఫీడర్ విద్యుత్‌లైన్లు, చైతన్యపురి, రేకుర్తి ప్రాంతాలతో పాటు సప్తగిరికాలనీ, ప్రతిమ ఆసుపత్రి ఫీడర్ల పరిధిలోని విద్యుత్ తీగలు, 33 కేవీ గంగాధరలో ఫ్లెక్సీలు పడటంతో విద్యుత్‌ను నిలిపివేసి ఫ్లెక్సీలను తొలగించారు. అనంతరం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. నగరంలో ఫ్లెక్సీలను తొలగించేందుకు మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన వాహనాన్ని ఉపయోగించారు. విద్యుత్ అంతరాయాలను ఎస్ఈ వి.గంగాధర్, డీఈ రాజం పర్యవేక్షిస్తూ సిబ్బందిని అప్రమత్తం చేశారు.
- శంకరపట్నం మండలం కేశవపట్నంలో చెట్టుకొమ్మ విరిగి ద్విచక్ర వాహనంపై పడింది. వివిధ గ్రామాలలో చెట్ల కొమ్మలు విరిగి రోడ్డుపై పడటంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. మండల కేంద్రంలోని కేంద్రంలో వరి ధాన్యం తడిసిపోయింది.
- మానకొండూర్ మండలం అన్నారం, లక్ష్మీపూర్, వేగురుపల్లి, ముంజంపల్లిలో మామిడి కాయలు నేలరాలాయి. ఈదులగట్టెపల్లి సమీపంలో చెట్టు రహదారికి అడ్డంగా పడడంతో రాకపోకలకు ఇబ్బంది ఎదురైంది. పలుచోట్ల కొమ్మలు స్తంభాలపై పడి విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. మానకొండూర్, ముంజంపల్లి కేంద్రాల్లో ధాన్యం కుప్పలు తడిశాయి. చెంజర్ల సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడ్డారు.



గంగాధర: నీటిలో ధాన్యం కుప్పలు



మానకొండూర్: స్తంభంపై విరిగిపడిన చెట్టు



కొత్తపల్లి: విద్యుత్ వైర్లపై ఫ్లెక్సీ తొలగింపును పర్యవేక్షిస్తున్న ఎస్ఈ గంగాధర్, అధికారులు



గన్నేరువరం: పారువెల్లలో రాలిన మామిడి



జూబ్లీనగర్ కేంద్రంలో నీటిని మళ్లిస్తున్న రైతులు

వందశాతం పోస్టల్ బ్యాలెట్ పూర్తిచేయాలి

- ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి



సిబ్బందికి సూచనలు చేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్‌అర్బన్: పార్లమెంట్ ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు, అధికారులు తమ పోస్టల్ బ్యాలెట్ ఓటు వినియోగించుకోవాలని ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మంగళవారం పలు శాఖల అధికారులతో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌పై సమీక్షించారు. వంద శాతం పోస్టల్ ఓట్లు నమోదయ్యేలా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని ఆదేశించారు. పోస్టల్ బ్యాలెట్‌కు బుధవారంతో గడువు ముగుస్తుందని, ఆయా శాఖల్లో ఓటు హక్కు వినియోగించుకోని ఉద్యోగులకు తక్షణమే సమాచారం ఇవ్వాలని సూచించారు. ఉదయం 7 నుంచి రాత్రి 8గంటల వరకు ఓటు హక్కు వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు

పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు ఇబ్బందులు పడకుండా అధికారులు అన్ని వసతులు కల్పించాలని కలెక్టర్ సూచించారు. కేంద్రాల్లో చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ఎండాకాలం నేపథ్యంలో మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. అలాగే అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా 342 ప్రభుత్వ స్కూళ్లలో మరమ్మతు పనులను అధికారులు వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. జూన్ 10లోగా పాఠశాలల్లో పనులన్నీ పూర్తి కావాలని ఆదేశించారు. సమావేశాల్లో అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, ట్రైనీ కలెక్టర్ అజయ్‌యాదవ్, జెడ్పీ సీఈవో శ్రీనివాస్, హుజురాబాద్ ఆర్డీవో రమేశ్ బాబు, డీఈవో జనార్దన్‌రావు, పరిశ్రమల శాఖ జీఎం నవీన్‌కుమార్, డీఆర్డీవో శ్రీధర్, డీపీవో రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు పక్కా ఏర్పాట్లు

పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పక్కాగా అన్ని ఏర్పాట్లు చేపడుతున్నామని కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. మంగళవారం కరీంనగర్‌లోని ఈవీఎం గోదామును సందర్శించారు. ఫస్ట్ లెవెల్ చెకింగ్‌లో రిజెక్ట్ అయిన ఆరు బ్యాలెట్ యూనిట్లను పర్యవేక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, సదరు బ్యాలెట్ యూనిట్లను హైదరాబాద్‌లోని సీఈవో కార్యాలయానికి జాగ్రత్తగా పంపిస్తున్నామని తెలిపారు. ఈవీఎంఎస్ నోడల్ అధికారి కిరణ్ ప్రకాశ్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ శ్రీవాణి, రాజకీయ పార్టీల నాయకులు మడుపు మోహన్, సత్తినేని శ్రీనివాస్, కళ్యాడపు ఆగయ్య, బర్కత్ అలీ, నాంపల్లి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రజాస్వామ్య పరిరక్షణ

- బీజేపీ, బీఆర్ఎస్ రెండూ ఒక్కటే
- మంత్రి పొన్నం ప్రభాకర్



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్, పక్కన ఎంపీ అభ్యర్థి రాజేందర్‌రావు, ఎమ్మెల్యేలు

కరీంనగర్ కార్పొరేషన్: కాంగ్రెస్‌కు ఓటు వేయడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని రక్షించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రజానీకాన్ని కోరారు. తల్లిని అవమానించిన బండి సంజయ్‌కి ఈ ఎన్నికల్లో బుద్ధిచెప్పాలన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ రెండు వేర్వేరు కాదన్నారు. బుధవారం ఎస్సారార్ కళాశాలలో జనజాతర సభావేదికపై నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. దేశవ్యాప్తంగా ప్రజలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారన్నారు. ఉత్తర భారత్‌లో ఇప్పటికే జరిగిన పోలింగ్‌లో కాంగ్రెస్‌కే అనుకూలం ఉండడంతో, మోదీ రెచ్చగొట్టి పబ్బం గడుపుకునే ప్రయత్నం చేస్తున్నాడన్నారు. ముస్లింలకు సంపద దోచిపెడుతారని, హనుమాన్‌చాలీసా చదవనీయరంటూ దిగజారి మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. దేశంలో ప్రజాస్వామ్యానికి ప్రమాదం ఏర్పడిందని ఆకునూరి మురళి, కోదండరాం తదితర మేధావులు గుర్తించి ప్రజల్లోకి వస్తున్నారన్నారు. హిందువనంటూ చెప్పుకునే బండి వేములవాడ రాజన్న, కొండగట్టు అంజన్నకు ఒక్క రూపాయి తెచ్చాడా అని ప్రశ్నించారు. మహిళలను కాంగ్రెస్ గౌరవించిందని, అందుకే ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించిందన్నారు. జాతీయ రహదారి, గ్రానైట్, స్మార్ట్‌సిటీ.. అంశం ఏదైనా సంజయ్‌ది కుమ్మక్కు రాజకీయమన్నారు. స్మార్ట్ సిటీ అక్రమాలపై విజిలెన్స్ విచారణకు ఎందుకు లేఖ రాయలేదన్నారు. బండి, వినోద్ గెలిచినా, ఓడినా తేడా ఉండదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఐక్యంగా ఉందని, తమ అభ్యర్థి గెలుపునకు పార్టీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, పార్టీ శ్రేణులు కలిసికట్టుగా కృషి చేస్తున్నామని వివరించారు. ఎండ వేడికి తట్టుకోలేని సమయంలో వర్షం పడి వాతావరణం అనుకూలంగా మారిందని, అదే తరహాలో ఎన్నికల వాతావరణం కాంగ్రెస్‌కు అనుకూలంగా మారిందన్నారు. మూడు మండలాలు మినహా నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ప్రచారం పూర్తి చేశామన్నారు. సమావేశంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, కేకే మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ టి.సంతోష్‌కుమార్, ఆరెపల్లి మోహన్, కోడూరి సత్యనారాయణగౌడ్, వైద్యుల అంజన్‌కుమార్, కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, మెనేని రోహిత్‌రావు, రాచకొండ చక్రధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



ఇంటర్వ్యూ

- కరీంనగర్‌లో బీజేపీ గెలుపు తథ్యం
- మా వ్యూహం ప్రధాని మోదీ.. మా బలం కరీంనగర్ ప్రజలు, అభివృద్ధి
- బీఆర్ఎస్ అభ్యర్థి ప్రజలను పట్టించుకోలేదు..
- కాంగ్రెస్ అభ్యర్థి ప్రజలకు తెలియదు..
- 'సాక్షి'తో ఎంపీ బండి సంజయ్‌కుమార్

వార్ వన్ సైడే

ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు తథ్యమని ఎంపీ బండి సంజయ్‌కుమార్ అన్నారు. రెండోసారి పార్లమెంట్ బరిలో నిలిచిన ఆయన ఈసారి వార్ వన్ సైడేనని ధీమా వ్యక్తం చేశారు. తమ వ్యూహం ప్రధాని మోదీ అని, కరీంనగర్ ప్రజలే తమ బలమని పేర్కొన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు గడీల వారసులు, తాను గరీబోళ్ల బిడ్డనని, పైగా పక్కా లోకల్ అన్నారు. గెలిచినా, ఓడినా తాను ఇక్కడే ఉంటానని, వారు ఓడిపోతే ముఖం చూపించరని ఎద్దేవా చేశారు. 'సాక్షి' ఇంటర్వ్యూలో ఆయన మరిన్ని విషయాలు వెల్లడించారు. –సాక్షిప్రతినిధి,కరీంనగర్

ఈసారి కరీంనగర్‌లో హోరాహోరీ పోరు నెలకొంది? ఎదుర్కొనేందుకు ఎలాంటి వ్యూహాలు రూపొందించారు?

హోరాహోరీ అని మీరనుకుంటున్నారు. కానీ, ప్రజలు ఎప్పుడో డిసైడ్ అయ్యారు. వార్ వన్ సైడే. కాంగ్రెస్ అభ్యర్థి ఎవరో కూడా ప్రజలకు తెలియదు. బీఆర్ఎస్ అభ్యర్థి ఏనాడూ వారిని పట్టించుకోలేదు. ప్రజలు కూడా ఆయనను ఎప్పుడో మర్చిపోయారు. మా వ్యూహం మా ప్రధాని అభ్యర్థి మోదీయే. మా బలం ప్రజలు, చేసిన అభివృద్ధి, ప్రజా సమస్యలపై నేను చేసిన పోరాటాలు, నేను పక్కా లోకల్. ఇక్కడి ప్రజలే నన్ను లీడర్‌గా మార్చి, ఈ స్థాయికి తీసుకొచ్చారు. పార్టీ ప్రోత్సాహం, కార్యకర్తల అండతో రాష్ట్రమంతా తిరిగి, కష్టాల్లో ఉన్న ప్రజల పక్షాన పోరాటాలు చేసి, కేసీఆర్ గడీలు బద్దలు కొట్టిన. బీజేపీ గెలుపు నల్లేరు మీద నడకే. ప్రత్యేక వ్యూహాలు అవసరం లేదు.

కాంగ్రెస్ అభ్యర్థికి బదులుగా మీకు, మంత్రికే మాటల యుద్ధం నడుస్తోంది. ఎందుకు?

కాంగ్రెస్ ప్యారాచూట్ అభ్యర్థి గురించి మాట్లాడాల్సిందేముంది? ఇగ మంత్రి అంటారా? నేను 6 గ్యారంటీలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నిస్తున్న.. ప్రజల్లో దీనిపై చర్చ జరుగుతుంటే దాన్ని పక్కదారి పట్టించేందుకు అధికారం ఉందన్న అహంకారంతో అడ్డగోలుగా మాట్లాడుతున్నారు. అసభ్య పదజాలం వాడుతూ రెచ్చగొట్టాలనుకుంటున్నారు. ఆయన ఎన్ని తిట్టినా, శాపనార్థాలు పెట్టినా నేను పట్టించుకోను. కాంగ్రెస్ మేనిఫెస్టోలోని హామీలన్నీ అమలు చేయించే దాకా రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీగా వివిధ రూపాల్లో ప్రశ్నించడం, పోరాటాలు చేస్తూనే ఉంటా.

ఐదేళ్లలో మీరు అభివృద్ధి చేయలేదంటున్న బీఆర్ఎస్‌కు మీ సమాధానం ఏంటి?

కళ్లుండి చూడలేని గుడ్డి వాళ్లు.. చెవులుండి వినలేని చెవిటోళ్లు బీఆర్ఎస్ నాయకులు. నేను కరీంనగర్‌కు ఏం చేశానో కొన్ని వేలసార్లు చెప్పాను. దాదాపు రూ.12 వేల కోట్లు తీసుకువచ్చి, అభివృద్ధి పనులు చేశాను. వాటిపై బుక్‌లెట్ విడుదల చేసి, ఇంటింటికీ పంచిన. బ్రోచర్లు వేసిన. నేను తెచ్చిన నిధులతో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో రోడ్లను నిర్మిస్తున్నరు. ఆ రోడ్ల మీద రోజూ తిరుగుతూ నేనేం చేయలేదనడం వారి మూర్ఖత్వానికి నిదర్శనం.

అంతా మర్చిపోయారనుకున్న ఫోన్ ట్యాపింగ్ అంశాన్ని కదిలించి, కాంగ్రెస్‌ను ఇబ్బందుల్లోకి నెట్టారా?

ఫోన్ ట్యాపింగ్ జరిగింది నిజం. అందులో ప్రధాన నిందితుడు ప్రభాకర్‌రావు వియ్యంకుడు అశోక్‌రావు కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం పని చేస్తున్నది, ఎన్నికల్లో ఆయనకు అన్ని రకాల ఆర్థిక వనరులను సమకూరుస్తున్నది నిజం. ఆ డబ్బులన్నీ కేసీఆర్ నుంచి ప్రభా కర్‌రావుకు, ఆయన నుంచి అశోక్‌రావుకు వెళ్తున్నాయ ని కాంగ్రెస్ నాయకులే చర్చించుకుంటున్నారు. ఇగ, కేసీఆర్ కుటుంబానికి, ఇక్కడి మంత్రికి, కాంగ్రెస్ అభ్యర్థికి సంబంధాలు ఉన్నది ముమ్మాటికీ నిజం. కేటీఆర్‌తో ఈ మంత్రికి సన్నిహిత సంబంధాల్లేవు, ఆయనను కలువలేదు, మాట్లాడలేదని చెప్పగలడా? ఫోన్ ట్యాపింగ్‌పై ఇప్పటివరకు సీఎం ఎందుకు స్పందించలేదు? ఆ మంత్రి ఎందుకు మాట్లాడటం లేదు?

రిజర్వేషన్ల విషయంలో బీజేపీపై జరుగుతున్న ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొడుతున్నారా?

పట్టపగలు దుకాణంలో దూరి దొంగతనం చేసినోడే దొంగ దొంగ అని అరిచినట్లుంది కాంగ్రెస్ నేతల తీరు. రిజర్వేషన్లకు తూట్లు పొడిచింది ఆ పార్టీనే. ముస్లిం రిజర్వేషన్ల అమలు పేరుతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, అగ్రవర్ణ పేదలకు అన్యాయం చేసింది. అగ్రకులాల్లోని పేదలకు కూడా 10 శాతం రిజర్వేషన్లు కల్పించిన వ్యక్తి మోదీ. పైగా ఆయన ఒక బీసీ. అలాంటి వ్యక్తి రిజర్వేషన్లు ఎందుకు రద్దు చేస్తారు? ఆరు గ్యారంటీల అమలును ప్రశ్నిస్తున్నందుకు కాంగ్రెస్ మాపై చేస్తోన్న ఎదురుదాడి ఇది.

లోకల్, నాన్ లోకల్ అంశాన్ని బాగా తెరపైకి తీసుకువస్తున్నారు. ఎందుకు?

ప్రజలకు వాస్తవాలు చెబుతున్నా. నేను ఈ గడ్డమీదే పుట్టిన. ఇక్కడే పోరాటాలు చేసిన. ఇక్కడి ప్రజల కష్టాల్లో అండగా ఉన్న. నాకు ఈ గడ్డపై ఉన్నది పేగు బంధం. కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు ఎన్నడైనా ఇక్కడి ప్రజల కోసం పోరాటాలు చేశారా? ఎన్నికలప్పుడు వచ్చి, డబ్బులిచ్చి ఓట్లు దండుకోవాలనే పెయిడ్ బంధం వాళ్లది. నేను గరీబోళ్ల బిడ్డను. వాళ్లు గడీల వారసులు. ఎన్నికల్లో గెలిచినా, ఓడినా ఇక్కడే ఉన్నా. వాళ్లు ఓడిపోతే మళ్లా ఇటువైపు చూడరు.

వేములవాడ, కొండగట్టులను ప్రసాద్ స్కీంలో చేర్చలేమా?

వేములవాడ, కొండగట్టు అంజన్న ఆలయాలను ప్రసాద్ స్కీంలో చేరుస్తాం. ప్రతిపాదనలు పంపండి మహాప్రభో.. అంటే ఎక్కడ మోదీకి పేరు వస్తుందోనన్న అక్కసుతో కేసీఆర్ సహకరించలేదు. వేములవాడ, కొండగట్టు, ధర్మపురిలకు నిధులిస్తానని దేవుళ్లకే శఠగోపం పెట్టిన కేసీఆర్ గతి ఏమైంది? ఈసారి కేంద్రంతో మాట్లాడి, అన్ని విధాలా అభివృద్ధి చేసే బాధ్యత నేను తీసుకుంటా.

ఈసారి మీరు కరీంనగర్ ఎంపీ సెగ్మెంట్‌కే పరిమితమయ్యారు. ఎందుకు?

అసెంబ్లీ తరహాలోనే ఈసారి కూడా రాష్ట్రమంతా తిరిగి, ప్రచారం చేయాలని పార్టీ నేతలు కోరుతున్నారు. కానీ, నా పార్లమెంట్ పరిధిలోనే 7 అసెంబ్లీ నియోజకవర్గాలున్నయ్ కదా.. అవన్నీ తిరిగి, ప్రజలను కలుసుకోవడానికే చాలా సమయం పడుతోంది. అందుకే ఇతర నియోజకవర్గాల్లో ప్రచారానికి వెళ్లలేకపోయా. అయినా, జాతీయ నేతలు, సీఎంలు వచ్చి, ప్రచారం చేస్తున్నారు.

కాంగ్రెస్, బీజేపీల మాయలో పడొద్దు

- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్, పక్కన ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్ తదితరులు

కరీంనగర్: బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మాయమాటలు నమ్మవద్దని ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. మంగళవారం నగరంలోని 56వ డివిజన్ భాగ్యనగర్ కమ్యూనిటీ హాల్‌లో డివిజన్‌వాసులతో సమావేశం ఏర్పాటు చేసిన అనంతరం ఇంటింటా ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ భావోద్వేగాలను సృష్టించి గెలువాలని బీజేపీ అభ్యర్థి చూస్తున్నాడని, సెంటిమెంట్‌తో కాంగ్రెస్ గెలువాలని కలలు కంటుందని, ప్రజలు విజ్ఞతతో ఆలోచించి బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని కోరారు. తాను ఎంపీగా వేల కోట్లతో అభివృద్ధి పనులు చేశానని, స్మార్ట్ సిటీ, జాతీయ రహదారులు, పట్టణ సుందరీకరణ, తీగలవంతెన, మానేరు రివర్ ఫ్రంట్, టీటీడీ దేవాలయం, కొండగట్టు ఆలయానికి 133 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించడంలో తన పాత్ర ఉందని స్పష్టం చేశారు. విభజన చట్టంలోని హామీలను అమలు చేయకుండా బీజేపీ తెలంగాణ పట్ల నిర్లక్ష్యం వహిస్తుందని, ఆ పార్టీకి ఓట్లు అడిగే నైతిక హక్కు లేదన్నారు. జూన్ 2తో తెలంగాణ ఆవిర్భావం జరిగి పదేళ్లు అవుతుందని, దీనిని సాకుగా తీసుకొని ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి యూటీగా మార్చే పనిలో బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటవుతాయని ఆరోపించారు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో వినోద్‌కుమార్‌ను ఎంపీగా గెలిపించడం ద్వారా రెట్టింపు అభివృద్ధి జరుగుతుందన్నారు. కాంగ్రెస్, బీజేపీలతో ఒరిగేదేమి లేదని, అవి ప్రజా వ్యతిరేక పార్టీలని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు ఎల్.రమణ, భానుప్రసాద్‌రావు, మేయర్ సునీల్ రావు, కార్పొరేటర్ రాజేందర్‌రావు, మున్సిపల్ కోఆప్షన్ అజిత్‌రావు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు చల్లా హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఈతవనం దగ్ధం

రామగుండం: అంతర్గాం మండలం పెద్దంపేట గ్రామ శివారు అంతర్గాం నూకాంబిక పోచమ్మ ఆలయ సమీపంలోని ఈతవనం మంగళవారం అగ్నికి ఆహుతైంది. గుర్తు తెలియని వ్యక్తులు సమీపంలోని ఎండిన కొమ్మలకు నిప్పంటించడంతో ఈదురుగాలి ధాటికి మంటలు వ్యాపించాయి. ఈ సంఘటనలో 40 ఈతచెట్లు కాలిబూడిదయ్యాయి. తద్వారా గీత కార్మికులు ఉపాధి కోల్పోయారని పైడిపల్లి వెంకటస్వామి ఆవేదన చెందాడు. ప్రభుత్వం, ఎక్సైజ్ శాఖ స్పందించి ఆర్థిక సాయం అందించాలని గీత కార్మిక సంఘం ప్రతినిధులు కోరుతున్నారు.

నగదు పట్టివేత



పట్టుకున్న నగదుతో సీఐ విజయ్‌కుమార్

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ టూ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గీతాభవన్ చౌరస్తా వద్ద సోమవారం రాత్రి నిర్వహించిన వాహన తనిఖీల్లో సరైన ఆధారాలు లేని రూ.2,57,870 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. కొత్తపల్లి హవేలీకి చెందిన మామిడాల సతీశ్ నుంచి డబ్బు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇందుకు తగిన ఆధారాలు చూపలేదని వివరించారు.

రూ.5,42,550..

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లాకేంద్రంలోని మోచీబజార్‌లో మంగళవారం పట్టణ ఎస్సై మన్మథరావు ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. సారంగాపూర్ మండలం రేచపల్లికి చెందిన చక్రపు శిరీష ఎలాంటి పత్రాలూ లేకుండా రూ.4.84లక్షలు తీసుకెళ్తుండగా సీజ్ చేశారు. టవర్‌సర్కిల్ ప్రాంతంలో ఎస్సై నరేశ్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టగా గాంధీనగర్‌కు చెందిన రమేశ్ రూ.58,550 తీసుకెళ్తుండగా పట్టుకుని కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్‌సెల్‌కు అప్పగించారు.

రూ.4 లక్షలు..

మెట్‌పల్లి:పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద మంగళవారం ఎస్సై చిరంజీవి తన సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేశారు. ఓ వ్యక్తి అనుమతి పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.4లక్షలను సీజ్ చేశారు. వాటిని గ్రీవెన్స్ కమిటీకి అప్పగించారు.

రూ.1.10 లక్షలు..

హుజూరాబాద్‌రూరల్ : పట్టణ శివారులోని పర్కాల్ క్రాస్ వద్ద ఉన్న చేసిన చెక్ పోస్టు వద్ద నగదు పట్టుబడినట్లు టౌన్‌సీఐ బొల్లం రమేశ్ మంగళవారం తెలిపారు. మండలంలోని కందుగుల గ్రామానికి చెందిన బొల్లవేణి సాంబయ్య వాహనంపై వెళ్తుండగా ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.లక్షా 10 వేలను పట్టుకున్నట్లు తెలిపారు. రూ.50 వేల పైన నగదు తీసుకెళ్తే ఆధారాలు తప్పనిసరిగా ఉండాలని సూచించారు.

దుబాయ్‌లో కొల్వాయి యువకుడి దుర్మరణం

సారంగాపూర్:బీర్‌పూర్ మండలం కొల్వాయి గ్రామానికి చెందిన బంద్ర రాజేశ్ దుబాయ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. కొల్వాయికి చెందిన రాజేశ్ (28) ఉపాధి నిమిత్తం ఆరేళ్ల క్రితం దుబాయ్ వెళ్లాడు. అక్కడ ఓ కంపెనీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వారం క్రితం రోడ్డు ప్రమాదం జరిగి తీవ్రంగా గాయపడ్డాడు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్న ఆయన మంగళవారం చనిపోయినట్లు ఇక్కడి బంధువులకు సమాచారం అందింది. ఎదిగిన కొడుకు దుబాయ్‌లో మృతిచెందడంతో తల్లిదండ్రులు రాజవ్వ, చంద్రయ్య కన్నీరుమున్నీరవుతున్నారు.

ప్రచారానికి మొగులు గుబులు

- నిన్నటిదాకా ఎండలు, ఇప్పుడు వానలు
- భారీ వర్షం కారణంగా రద్దయిన సీఎం సభ
- వేములవాడ ప్రధాని సభకూ వాన ముప్పు
- 11వ తేదీ వరకు ఇదే వాతావరణం ఉండే చాన్స్
- రూ.కోట్ల ధనం వృథా అయిందని నేతల ఆవేదన



కరీంనగర్‌లో గాలివానతో చెల్లాచెదురుగా పడ్డ జనజాతర సభ కోసం ఏర్పాటు చేసిన కుర్చీలు, టెంట్లు

సాక్షిప్రతినిధి,కరీంనగర్:

పార్లమెంట్ ప్రచారంలో నిండా మునిగిన నాయకులు ప్రత్యర్థులను ప్రకృతి పగబట్టినట్లే ఉంది. నిన్నటిదాకా భానుడి భగభగలతో తల్లడిల్లిన నాయకులు సరిగా ప్రచారం చేయలేకపోగా.. ప్రస్తుతం ఆకస్మిక వానలతోనూ దాదాపుగా అదే పరిస్థితి నెలకొంది. 47 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతతో చరిత్రలో ఇటీవలి కాలంలో అత్యంత అధిక ఉష్ణోగ్రతలు నమోదైన సంవత్సరంగా 2024 రికార్డులకెక్కింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనూ 46 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదవడంతో నాయకులు, కార్యకర్తలు తల్లడిల్లారు. ముఖ్యనాయకులు రోజుకు రెండు మూడు సభల్లో పాల్గొనాల్సి రావడం వల్ల చాలాచోట్ల మిట్ట మధ్యాహ్నం సభలు ఏర్పాటు చేశారు. దీంతో పలు చోట్ల సభలకు వెళ్లినవారు ఎండదెబ్బకు గురై తీవ్ర అస్వస్థత పాలయ్యారు. అదే సమయంలో ఎండల కారణంగా కార్యకర్తలు, నాయకులు పూర్తిస్థాయిలో ప్రచారం చేయలేకపోయారు. తాజాగా భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఈనెల 7 నుంచి 11వ తేదీ వరకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపల్లిలో ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వానలు కురిసే అవకాశముందని హెచ్చరించింది. ఐఎండీ చెప్పినట్లుగా..11 వరకు భారీ వర్షాలు వెంటాడితే ప్రచారం ఎలా చేసేది? అని పార్లమెంట్‌కు పోటీ పడుతున్న అభ్యర్థులు, సీనియర్ నాయకులు ఆందోళన చెందుతున్నారు. తాము రూ.లక్షలు ఖర్చు పెట్టి జనసమీకరణ చేసి, వారికి తాగునీరు, మజ్జిగ, భారీ టెంట్లు, వాహనాలు సమకూర్చితే.. తీరా ఎండలు, వానల కారణంగా సభలు రద్దవడం లేదా జనాలు ఆశించిన మేరకు రాకపోవడం వారిని తీవ్ర నిరుత్సాహానికి గురిచేస్తోంది.

ప్రధాని సభపై నీలినీడలు

వేములవాడలో నిర్వహించతలపెట్టిన ‘వేములవాడ జనసభ’కు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రానున్నారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చిన తర్వాత ఇంతవరకూ ఏ ప్రధాని కూడా దక్షిణ కాశీగా పేరొందిన శ్రీరాజరాజేశ్వరస్వామిని దర్శించుకున్న దాఖలాలు లేవు. ఈసారి కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి బండి సంజయ్ ప్రత్యేక వినతి మేరకు ఆయన వేములవాడకు రానున్నారు. ఉదయం 10 గంటల సమయంలో వేములవాడ బాలామైదాన్‌లో ఏర్పాట్లను ఎంపీ సంజయ్ స్వయంగా పర్యవేక్షించారు. మంగళవారం ఆకస్మిక వర్షానికి సభ ఏర్పాట్లు చెదిరిపోయినా.. తిరిగి ఏర్పాటు చేయించారు. అయినా ఐఎండీ హెచ్చరిక నేపథ్యంలో వర్షం భయం వెంటాడుతూనే ఉంది. మరోవైపు మంగళవారం కరీంనగర్‌లో నిర్వహించతలపెట్టిన జనజాతర సభ భారీ వర్షం కారణంగా రద్దయింది. భారీ ఈదురుగాలుల నేపథ్యంలో హెలీక్యాప్టర్ ఎగిరే వీలులేక సీఎం సభ రద్దు చేశారు. అదే సమయంలో మంథనిలో రాజస్తాన్ సీఎం హాజరైన సభకూ ఈదురుగాలులు, భారీవర్షం కారణంగా అనుకున్నంత మేరకు విజయం కాకపోవడంతో పార్టీ శ్రేణులు తీవ్ర నిరుత్సాహానికి గురయ్యారు.

భారీ బందోబస్తు

ప్రధాని పర్యటన నేపథ్యంలో వేములవాడలో భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. ప్రధాని పర్యటించే ఆలయ పరిసరాలు, బాలమైదాన్ సభా ప్రాంగణం పూర్తిగా ప్రధాని భద్రతా దళమైన స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్పీజీ) తన ఆధీనంలోకి తీసుకుంది. స్థానిక పోలీసులతోపాటు దాదాపు 1,500 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొంటున్నారని సమాచారం.

పోస్టల్ బ్యాలెట్ తప్పలొద్దు

- తిరస్కరణకు తావివ్వొద్దు
- గత అసెంబ్లీ ఎన్నికల్లో చెల్లనివి 1,739

గత అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గాల వారీగా తిరస్కరణకు గురైన ఓట్లు

కరీంనగర్	302	వేములవాడ	125
హుజూరాబాద్	298	సిరిసిల్ల	208
చొప్పదండి	214	హుస్నాబాద్	312
మానకొండూరు	280		



కరీంనగర్ అర్బన్: పోస్టల్ బ్యాలెట్ ఓటు.. విద్యావంతులైన ఉద్యోగులు వేసే ఓటు. కానీ సదరు ఉద్యోగులే తప్పులు చేస్తుంటే ఓటు చెల్లుబాటు కాకుండా పోవడం ఆందోళనకర పరిణామం. నిబంధనలు తెలియవా.. కావాలని చేస్తున్నారో కానీ సమాజంలో నవ్వులపాలవుతున్నారు. ఈ క్రమంలో ప్రతి పోస్టల్ బ్యాలెట్ చెల్లేలా సదరు ఓటర్లు జాగ్రత్తగా ఓటును వినియోగించి ఆదర్శంగా నిలవాలి మరీ. ఎన్నికల విధులు నిర్వర్తించే ఉద్యోగులు, సిబ్బంది, సైనికులు, ఇతర అత్యవసర సేవలకు చెందినవారు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ముందస్తుగా ఓటుహక్కు వినియోగించుకోవడం పరిపాటి. అయితే ఓటు వేసే క్రమంలో ఉద్యోగులు సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల తిరస్కరణకు గురవుతున్నాయి.

గత అసెంబ్లీ ఎన్నికల్లో..

గత అసెంబ్లీ ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ల దరఖాస్తు పత్రాలను నేరుగా సేకరించి జిల్లాలకు పంపించారు. దీంతో ఉద్యోగులు, వివిధ సర్వీసుల వారు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. ఈసారి ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్ కోసం అప్లికేషన్‌ను అందుబాటులోకి తెచ్చింది. సిబ్బంది ఫాం 12 పత్రాలను సేకరించి ఎపిక్ కార్డుతో సహా వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపర్చారు. సదరు ఉద్యోగి ఎక్కడ ఓటు వేయడానికి ఎంపిక చేసుకున్నారో ఆ డేటా అంతా ఆన్‌లైన్‌లో కనిపించేలా ఏర్పాట్లు చేశారు. ఓటు వేసేటప్పుడు పొరపాట్లు జరగకుండా సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నారు. డిక్లరేషన్ సమయంలో ఇబ్బందులు కలగకుండా గెజిటెడ్ అధికారులను అందుబాటులో ఉంచుతున్నారు. ఈనెల 8 వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ జరగనుంది.

ఒకరికే టిక్ చేయాలి

పోస్టల్ బ్యాలెట్ వేసేవారికి ఫాం 12 ఇస్తారు. ఇందులో 13ఏ, 13బీ, 13సీ, 13డీ కవర్లు ఉంటాయి. 13ఏ కవర్లో డిక్లరేషన్ ఫాంపై తప్పకుండా సంతకం చేయాలి. బ్యాలెట్ నంబరు, సీరియల్ నంబరు వేయాలి. 13బీ కవర్‌లో బ్యాలెట్ పేపర్ ఉంటుంది. అభ్యర్థులు, పార్టీల పేర్లు మాత్రమే ఉంటాయి. వాటి ఎదురుగా పెన్నుతో రైట్ గుర్తు పెట్టాలి. ఒకరి ఎదురుగా మాత్రమే టిక్ పెట్టాలి. ఒకరి కంటే ఎక్కువ మందికి టిక్ చేస్తే తిరస్కరణకు గురవుతుంది. ఏ అభ్యర్థికి లేదా నోటాకు టిక్ పెట్టకున్నా తిరస్కరిస్తారు. పూర్తిచేసిన 13ఏ, 13బీ కవర్లను 13సీ కవర్లో పెట్టాలి. పోలింగ్ కేంద్రంలో బ్యాలెట్ పత్రంలో ఒకే అభ్యర్థి పక్కన టిక్ లేదా ఇంటు గుర్తు పెడితే ఓటు చెల్లుబాటు అవుతుంది.

ప్రధాని పర్యటనకు ప్రత్యేక బందోబస్తు

- అడుగడుగునా తనిఖీలు
- డాగ్‌స్క్వాడ్‌లతో ఆలయ పరిసరాల పరిశీలన



ఆలయ పరిసరాల్లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

వేములవాడ: ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం వేములవాడకు వస్తుండటంతో మంగళవారం జిల్లా పోలీసులతో పాటు ఎస్పీజీ, స్పెషల్ పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేశారు. అడుగడుగునా తనిఖీలు చేస్తూ, రోడ్లన్నీ బారికేడ్లతో మూసివేసి పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. దీంతో భక్తులు, స్థానికులు ఇబ్బందులకు గురయ్యారు.

బట్టోనితాళ్లలో చోరీ

- బంగారం, వెండి ఆభరణాల అపహరణ



చిందరవందరగా వస్తువులు

ముస్తాబాద్: మండలంలోని బట్టోనితాళ్ల గల కట్ట మహేందర్ ఇంట్లో దొంగలు చొరబడి బంగారం, వెండి ఆభరణాలు అపహరించుకెళ్లారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మహేందర్ సోమవారం రాత్రి ఇంటికి తాళం వేసి తన కుటుంబంతో బంగ్లాపై నిద్రించారు. దొంగలు ఇంటి తాళాన్ని పగులగొట్టి లోనికి చొరబడి బీరువలో గల మూడున్నర తులాల బంగారు, 35 తులాల వెండి ఆభరణాలతో పాటు రూ.35వేల నగదు ఎత్తుకెళ్లారు. మంగళవారం ఉదయం బంగ్లాపై నుంచి కిందికి వచ్చిన మహేందర్ ఇంటి తలుపులు తెరిచి ఉండటం చూసి పోలీసులకు సమాచారం అందించారు. మిర్చి పంట అమ్మగా వచ్చిన రూ.35వేలను ఆస్పత్రిలో చికిత్స కోసం దాచుకున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సై శేఖర్‌రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్ టీంతో ఆధారాలు సేకరిస్తున్నారు.

జగిత్యాలలో రెండిళ్లలో..




చిందరవందరగా బీరువాలోని సామగ్రి

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని శ్రీరాంనగర్‌లో తాళం వేసి ఉన్న రెండు ఇళ్లలో గుర్తుతెలియని దొంగలు మంగళవారం తెల్లవారుజామున రెండు ఇళ్ల తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. శ్రీరాంనగర్‌కు చెందిన రాగిల్ల లావణ్య తన ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లగా, దొంగలు ఇంట్లో ఉన్న బీరువా తాళాలు పగులగొట్టి రూ.20 వేల నగదు, తులంన్నర బంగారం ఎత్తుకెళ్లారు. అలాగే లవంగం రాజేందర్ ఇంట్లో కూడా చొరబడగా ఎలాంటి వస్తువులు పోలేదు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వేలిముద్రలు సేకరించారు.

11న ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

కరీంనగర్‌స్పోర్ట్స్/సుల్తానాబాద్: ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఫుట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 11న పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా మహిళల సీనియర్ ఫుట్‌బాల్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘం కార్యదర్శి గణపతి తెలిపారు. సుల్తానాబాద్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో రాణించిన క్రీడాకారిణులను త్వరలో మంచిర్యాల జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారిణులు ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోతో సాయంత్రం 4 గంటలకు మైదానంలో రిపోర్టు చేయాలన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా సంఘం ఉపాధ్యక్షుడు అంతటి శంకరయ్య 9849114956 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

గడ్డివాములు దగ్ధం



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

శంకరపట్నం: మండలంలోని ముత్తారం, అర్కండ్ల గ్రామాల్లో మంగళవారం పది గడ్డి వాములు దగ్ధమయ్యాయి. ముత్తారంలోని పంటపొలాల్లో కొయ్యకాళ్లకు నిప్పంటుకొని ఐదు గడ్డివాములు దగ్ధంకాగా మంటలు వ్యాపించకుండా రైతులు మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అర్కండ్లలో నిప్పంటుకుని ఐదు గడ్డివాములు దగ్ధమయ్యాయి. పోలీసులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించి మంటలనార్పివేశారు.

మానేరు వాగులో మునిగి యువకుడి మృతి



రమేశ్ మృతదేహం

తిమ్మాపూర్: మానేరు వాగులో మునిగి మంగళవారం ఓ యువకుడు మృతి చెందాడు. ఎల్ఎండీ ఎస్సై చేరాలు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌లో కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభకు సంబంధించిన ఫ్లెక్సీలు కట్టేందుకు హైదరాబాద్ నుంచి సోమవారం పది మంది యువకులు వచ్చారు. ఫ్లెక్సీలు కట్టిన తర్వాత మధ్యాహ్నం ఎండతీవ్రత నేపథ్యంలో ఈత కొట్టేందుకు మానేరు వాగులోకి వెళ్లారు. అందులోని సింగారం రమేశ్ (28) ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందారు. మృతుడి వివరాలు సేకరించి మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై వివరించారు.

రైలుకింద పడి రేషన్ డీలర్ భర్త ఆత్మహత్య



పెర్క లింగయ్య (ఫైల్)

పెద్దపల్లిరూరల్: పట్టణానికి చెందిన పెర్క లింగయ్య(56) మంగళవారం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. అతడి భార్య శారద రేషన్ డీలర్. కుటుంబ కలహాలే ఆత్మహత్యకు కారణమై ఉండొచ్చని స్థానికులు తెలిపారు. కూనారం రైల్వేగేటు సమీపంలో ఉన్న లింగయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి విచారణ జరుపుతున్నామని రైల్వేపోలీసులు తెలిపారు. మృతుడు లింగయ్యకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

సీఎం జనజాతర సభ రద్దు

కరీంనగర్ కార్పొరేషన్: ఈదురు గాలులు.. వర్షం కారణంగా నగరంలో బుధవారం ఏర్పాటు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి జనజాతర బహిరంగ సభ చివరి నిమిషంలో రద్దయింది. కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు మద్దతుగా సీఎం చేపడుతున్న ప్రచారంలో భాగంగా నగరంలోని ఎస్సారార్ కళాశాల మైదానంలో సభ ఏర్పాటు చేశారు. హైదరాబాద్ నుంచి నేరుగా ఆయన కరీంనగర్‌కు చాపర్ ద్వారా రావాల్సి ఉండగా, అకస్మాత్తుగా మధ్యాహ్నం నుంచే ఈదురుగాలులు, వర్షం కురవడంతో సీఎం రాలేకపోయారు. అప్పటికే సభాస్థలికి కాంగ్రెస్ నాయకులంతా చేరుకున్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు సభాస్థలికి ప్రయాణమయ్యారు. వర్షం కారణంగా మార్గమధ్యలోనే నిలిచిపోగా, వచ్చిన కొద్ది మంది వర్షంలోనే తిరుగు ప్రయాణమయ్యారు. మధ్యాహ్నం 3 గంటలకు ఒక్కసారిగా వాతావరణంలో మార్పు కనిపించి, పట్టపగలే చీకటికమ్ముకొంది. ఈదురుగాలులకు మైదానంలో వేసిన టెండ్లు కూలిపోయాయి. అప్పటికే అక్కడక్కడా జనం కూర్చొని ఉండగా, భయంతో పరుగుతీశారు. పోలీసు విభాగానికి చెందిన ఓ అధికారికి స్వల్పగాయాలయ్యాయి. గంటన్నర తరువాత వర్షం తగ్గుముఖం పట్టగా, సమీపంలో ఉన్న ప్రజలు చేరుకోవడం ప్రారంభించారు. దీంతో సభను కొనసాగించేందుకు ప్రయత్నించారు. మంత్రి పొన్నం ప్రభాకర్, అభ్యర్థి రాజేందర్‌రావు తదితరులు పలుమార్లు చర్చించారు. మరోసారి వర్షం పడడడంతో సభను రద్దు చేసినట్లు వెల్లడించారు. అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ, సీఎం రేవంత్‌రెడ్డిలలో ఎవరో ఒకరితో కరీంనగర్‌లో మళ్లీ సభ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తామని మంత్రి పేర్కొన్నారు.

మైక్రో అబ్జర్వర్లు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న పరిశీలకులు అమిత్ కటారియా

కరీంనగర్ అర్బన్: ఎన్నికల నిర్వహణలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమని ఎన్నికల సాధారణ పరిశీలకులు అమిత్ కటారియా అన్నారు. మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఎన్నికల విధులు నిర్వర్తించే మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికలు స్వేచ్ఛాయుత, ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, ఏ చిన్న పొరపాటు జరగకుండా చూసుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ.. ఈసీ మార్గదర్శకాలపై మైక్రో అబ్జర్వర్లకు అవగాహన ఉండాలన్నారు. ఉదయం మాక్ పోలింగ్ నుంచి పోలింగ్ పూర్తయ్యే వరకు జాగ్రత్తగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ఏమైనా ఇబ్బందులు కలిగితే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం ఆంజనేయులు, ఈవీఎంస్ నోడల్ అధికారి కిరణ్ ప్రకాశ్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ మాధవి తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద బీజేపీని ఓడించాలి

- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు జె.వెంకటేశ్



మాట్లాడుతున్న వెంకటేశ్

కరీంనగర్: మతోన్మాద బీజేపీని ఓడించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు జె.వెంకటేశ్ పిలుపునిచ్చారు. మంగళవారం కరీంనగర్ కోతిరాంపూర్‌లోని ముకుందలాల్ మిశ్రా భవన్‌లో జరిగిన ఆ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ స్థాయి సభలో ఆయన మాట్లాడారు. ఎంపీ ఎన్నికల్లో 400 సీట్లు గెలిచి రాజ్యాంగాన్ని మారుస్తామని, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీల రిజర్వేషన్లు ఎత్తివేస్తామని బీజేపీ మంత్రులే వేదికల మీద ఉపన్యాసాలు ఇస్తున్నారని అన్నారు. కరీంనగర్ ఎంపీగా గెలిచిన బండి సంజయ్ నియోజకవర్గాన్ని అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంచారని, గ్రానైట్, ఇసుక మాఫియా వద్ద వేల కోట్ల రూపాయలు ముడుపులు తీసుకొని, ఆస్తులు కూడబెట్టుకున్నారని మండిపడ్డారు. బీజేపీ ప్రభుత్వం నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకూ పెంచుతూ పేద, మధ్యతరగతి ప్రజల నడ్డి విరిచిందన్నారు. ఇండియా కూటమిలో భాగంగా కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు సీపీఎం మద్దతు తెలుపుతోందని, ఆయన గెలుపునకు కృషి చేస్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి మాట్లాడుతూ.. సీపీఎం, సీపీఐలు తమకు మద్దతు ఇవ్వడం శుభపరిణామమన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ.. ఎంపీగా బండి సంజయ్ అభివృద్ధి నిరోధకుడిగా మారాడన్నారు. సీపీఎం రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి మూషం రమేశ్, హనుమకొండ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాములు, సిద్దిపేట జిల్లా నాయకుడు శివరాజ్, కరీంనగర్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గిట్ల ముకుంద రెడ్డి, వర్ణ వెంకటరెడ్డి, గుడికందుల సత్యం, జి.బీమాసాహెబ్, కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, నాయకులు పాల్గొన్నారు.

పొల్యూషన్ వల్లే ఆస్తమా సమస్య

- తొలి దశలో గుర్తిస్తే నియంత్రించవచ్చు
- వరల్డ్ ఆస్తమా డేలో పల్మనాలజిస్టులు



కార్యక్రమానికి హాజరైన మెడికవర్ వైద్యులు

కరీంనగర్ టౌన్: ప్రమాదకరంగా మారుతున్న పొల్యూషన్ వల్లే ఆస్తమా సమస్య తలెత్తుతోందని కరీంనగర్ పల్మనాలజిస్టులు తెలిపారు. వరల్డ్ ఆస్తమా డేను పురస్కరించుకొని, నగరంలోని మెడికవర్ ఆస్పత్రి, కరీంనగర్ చెస్ట్ ఫిజీషియన్స్ ఆధ్వర్యంలో మంగళవారం అంబేడ్కర్ స్టేడియంలో హెల్త్‌టాక్, ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 400 మంది వాకర్స్‌కు బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. ఆస్తమా ఊపిరితిత్తులను దెబ్బతీసే దీర్ఘకాలిక వ్యాధి అన్నా రు. పొగాకు, స్మోకింగ్, చల్లని గాలి, దుమ్ము, ధూళి, మానసిక ఆందోళన మొదలైనవి ప్రధాన కారణాల ని పేర్కొన్నారు. ఆస్తమాను తొలి దశలో గుర్తిస్తే నియంత్రణ సాధ్యమేనని తెలిపారు. ప్రస్తుతం అస్తమా కు వ్యాక్సిన్ అందుబాటులో ఉందని, ప్రతి ఒక్క రూ వ్యాక్సిన్ తీసుకుంటే ఆస్తమా బారిన పడకుండా జీవించవచ్చన్నారు. మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ మాట్లాడుతూ.. హైదరాబాద్ వెళ్లాల్సిన అవసరం లేకుండా మన కరీంనగర్‌లో సూపర్‌స్పెషాలిటీ వైద్యం అందుబాటులో ఉందని తెలిపారు. కార్యక్రమంలో పల్మనాలజిస్టులు వినయ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, రాము, కార్డియాలజిస్టులు కిరణ్‌కుమార్, రామనాథం, క్రిటికల్ కేర్ వైద్యులు ఉపేందర్, వెంకటేశ్, అన్వేశ్, వేణుగోపాల్, నాగరాజు, కార్తీక్, దిలీప్‌రెడ్డి, ప్రసన్న, ప్రతిష్ఠ, రవిమల్లారెడ్డి, వాకర్స్ అసోసియేషన్ బాధ్యులు శ్రీనివాస్, తిరుపతి, రవీందర్‌రెడ్డి, రమణారెడ్డి, వెంకటేశ్ పాల్గొన్నారు. అనంతరం వ్యాయామంలో భాగమైన జుంబా డాన్స్‌పై శిక్షణనిచ్చారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



సమ్మయ్య (ఫైల్)

శంకరపట్నం(మానకొండూరు): కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం అంబాల్‌పూర్ గ్రామానికి చెందిన రైతు గొల్లెన సమ్మయ్య(53) పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. బంధువులు, పోలీసుల కథనం ప్రకారం.. సమ్మయ్యకు రెండు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఆయనకు ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కుమారులు, భార్య ఉన్నారు. ఇద్దరు కూతుళ్ల వివాహం జరిపించి అత్తారింటికి పంపించారు. ఇటీవల కొత్త ఇల్లు నిర్మించుకున్నాడు. కూతుళ్ల వివాహం, ఇంటి నిర్మాణంతోపాటు పంటల పెట్టుబడి కోసం చేసిన అప్పులు అధికం అయ్యాయి. వాటిని తీర్చేదారిలేక మానసిక వేదనకు గురయ్యాడు. ఈక్రమంలో సోమవారం పురుగులమందు తాగాడు. కుటుంబసభ్యులు గమనించి కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు సురేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై సురేందర్ తెలిపారు.

ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి రాజన్నసిరిసిల్ల వాసి

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ తీగెల వంతెన పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి రాజన్నసిరిసిల్ల జిల్లాలోని గంభీరావుపేట మండలం భీమునిమల్లారెడ్డిపేటకు చెందిన గాజుపల్లి రాజనర్సు అలియాస్ ముత్యం(42)గా గుర్తించారు. కరీంనగర్‌రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ కథనం ప్రకారం.. రాజనర్సు సెంట్రింగ్ పని చేస్తున్నాడు. 11 రోజుల క్రితం హార్వెస్టర్ ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయమవడంతో కుటుంబసభ్యులు తొలుత ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. తర్వాత వేములవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున ఎవరికీ చెప్పకుండా కరీంనగర్ వచ్చాడు. తీగెల వంతెన పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కరీంనగర్ రూరల్ పోలీసులు గుర్తు తెలియని వ్యక్తి మృతదేహంగా తేల్చి, స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో భద్రపరిచారు. మంగళవారం పత్రికల్లో వచ్చిన ఫొటోను చూసి, మృతుడి కుమారుడు దిలీప్ కరీంనగర్ ఆస్పత్రికి వచ్చాడు. ఆ మృతదేహం తన తండ్రి రాజనర్సుదేనని గుర్తించాడు. అప్పులు ఎక్కువై, జీవితంపై విరక్తి తో ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

వీణవంక: అప్పుల బాధ భరించలేక ఓ రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన వీణవంక మండలం వల్భాపూర్ గ్రామంలో చోటు చేసుకొంది. గ్రామస్తుల వివరాల ప్రకారం పోతరాజు పోచాలు(45)అనే రైతు తనకున్న మూడెకరాల్లో మొక్కజొన్న , వరి పంట సాగు చేశాడు. పంట చివరి దశలో తడి అందక ఎండిపోయింది. దీంతో పెట్టిన పెట్టుబడి రాకా రూ.4లక్షల అప్పులయ్యాయి. అప్పులు తీర్చలేక జీవితం పై విరక్తి చెంది ఈ నెల 1న పురుగుల మందు తాగాడు. బంధువులు గమనించి కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై తోట తిరుపతి తెలిపారు. మృతుడి భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సాక్షి ఫ్యామిలీ
నిజామాబాద్
బుధవారం ॥ 8-5-2024

ప్రపంచంలో చాలామంది ఒకే తరహా పనిని ఏళ్లుగా చేస్తూ తమ జీవనాన్ని కొనసాగిస్తుంటారు. కొందరు మాత్రం ఏకకాలంలో ఎన్నో పనులు చేస్తూ సమాజంలో తమకంటూ ఓ ప్రత్యేకమైన గుర్తింపును ఏర్పరుచుకోవాలని ఎప్పుడూ ప్రయత్నిస్తుంటారు. అలాంటి వారిలో ఒకరు ఇందు గుర్జార్. జైపూర్‌వాసి అయిన 32 ఏళ్ల ఇందు గుర్జార్ సింగిల్ పేరెంట్‌గా తన తొమ్మిదేళ్ల కూతురును చూసుకుంటూ, బ్యాంకు ఉద్యోగం చేస్తూ, అంతర్జాతీయ క్రీడాకారిణిగా, మౌంటెనీర్ బైకర్‌గా గుర్తింపు తెచ్చుకుంటోంది. సవాళ్లను అధిగమిస్తూ ఇందు చేస్తున్న ప్రయత్నం ఒడిదొడుకులను ఎదుర్కొనేవారికి స్ఫూర్తిగా నిలుస్తుంది.


ఇందు గుర్జార్

ఉండాల్సింది ధైర్యం మాత్రమే!

''సమస్యలు వచ్చేదే మనలోని శక్తిని గుర్తించడానికి. ధైర్యం తెచ్చుకొని ప్రయత్నిస్తే తిరిగి మనకో కొత్త జీవితం ఏర్పడుతుంది. నా చిన్నతనంలో మాది దిగువ మధ్యతరగతి కుటుంబం. మా నాన్నకు టీ కొట్టు ఉండేది. కానీ, దాని నుంచే ఆయన తన కొడుకులలో ఒకరిని డాక్టర్‌ని చేసి, మా అందరికీ ఉత్తమవిద్యను అందించడానికి ప్రయత్నించాడు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నా. చిన్ననాటి నుంచి క్రీడలంటే చాలా ఆసక్తి. రాష్ట్రస్థాయిలో బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్ ఆడాను. కాలేజీలో స్పోర్ట్స్ ఆప్షన్ లేకపోవడంతో నా ఇష్టాన్ని అక్కడితో వదిలేయాల్సి వచ్చింది.

■ గృహహింస

మా కమ్యూనిటీలో అమ్మాయిలకు పెళ్లిళ్లు త్వరగా చేస్తారు. కానీ, నా తల్లిదండ్రుల సహకారంతో గ్రాడ్యుయేషన్ వరకు చదువుకున్నాను. ఆ వెంటనే పెళ్లి చేశారు. పెళ్లి నా జీవితాన్ని విచ్ఛిన్నం చేసింది. బిడ్డను కనాలని, వరకట్నం తేవాలని... ప్రతిరోజూ ఏదో ఒక విషయం మీద నరకం చూసేదాన్ని. అత్తింటివాళ్లు నా తల్లిదండ్రులకు నా మీద ఏవేవో చాడీలు చెప్పేవారు. పాప పుట్టిన తర్వాత పుట్టింటి నుండి తిరిగి అత్తవారింటికి వెళ్లడానికి భయపడ్డాను. కానీ, పెద్దవారిని కూర్చోబెట్టి, ఒప్పించి తిరిగి తీసుకెళ్లారు. కానీ, అక్కడి పరిస్థితుల్లో ఏ మాత్రం మార్పు లేదు. నెల రోజుల వ్యవధిలోనే మా అత్తింటిని వదిలి, తిరిగి పుట్టింటికి వచ్చేశాను. ఏడాది కాలం పుట్టింట్లోనే ఉన్నాను. పరిస్థితుల్లో మార్పు రాదని గ్రహించి, విడాకులకు కోర్టులో కేసు వేశాను. ఒంటరిగా బిడ్డను పెంచడం నాకు అంత తేలికైన పనికాదు. ఇంటి నిర్వహణకు, నా ఇష్టాలను నెరవేర్చుకోవడానికి ఇంధనం అవసరం. ఆ మనోవర్తి రూపంలో ఆ ఇంధనం రాబట్టుకోవడం కోసం ఏడేళ్లపాటు విడాకుల కేసుపై పోరాడుతూనే ఉన్నాను. కానీ, న్యాయం జరగలేదు.



■ డిప్రెషన్ నుంచి కోలుకొని...

ఆటుపోట్లతో ఉన్న జీవితాన్ని చూసి చాలా బాధపడేదాన్ని. ఒక వ్యక్తి జీవితంలో చెడుకాలం వచ్చినప్పుడు పరిస్థితుల ముందు లొంగిపోతాడు. కానీ, నాకు నేనుగా ఏదైనా లక్ష్యాన్ని ఏర్పరుచుకోవాలనుకున్నాను. బ్యాంకు ఉద్యోగం సంపాదించుకొని, నాకు నేనుగా జీవించడం మొదలుపెట్టాను.



■ ఫిట్‌గా ఉండేందుకు..

ఉద్యోగం చేయడం మొదలుపెట్టిన కొన్ని రోజులకే కోవిడ్ వచ్చింది. మొదటి వేవ్‌లో కరోనా బాధితురాలిని అయ్యాను. వాడిన మందుల వల్లనేమో కోవిడ్ తర్వాత బరువు పెరగడం మొదలైంది. దీంతో ఫిట్‌గా ఉండేందుకు రోజూ రెండు–మూడు కిలోమీటర్లు సైక్లింగ్ చేసేదాన్ని. ఆ తర్వాత స్టేడియంకు వెళ్లడం మొదలుపెట్టాను. అక్కడ సైక్లిస్టుల బృందాన్ని కలిశాను. ఆ క్రీడలో పాల్గొనడానికి వయోపరిమితి ఏమీ లేదని తెలిసింది. దాంతో నాలో చిన్న ఆశ కలిగింది. బహుశా విధి నాకు అలాంటి అవకాశం ఇచ్చింది అనుకున్నాను. మొదట్లో రెండు–మూడు కిలోమీటర్లు సైక్లింగ్ చేసే నేను ఈ రోజు 50– 100 కిలోమీటర్లు తిరుగుతున్నాను. యూసీఐ (ఇంటర్నేషనల్ సైకిలిస్ట్ యూనియన్) ఎలిమినేటర్ ప్రపంచకప్‌లో పాల్గొన్నాను. ఎన్నో పెద్ద పెద్ద ఈవెంట్లలో పాల్గొని, అంతర్జాతీయ సైక్లిస్టులను కలిశాను.

■ పర్వత బైకర్‌గా...

వృత్తిరీత్యా బ్యాంకర్‌గానే కాకుండా మూడేళ్లుగా మౌంటెన్ బైకర్‌గా కూడా ఉన్నాను. పర్వతాల్లో చేసే సాహసోపేతమైన పోటీల్లో విజేతగా నిలుస్తుండేదాన్ని. ఆ పోటీలు ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చేవి. రెండేళ్ల క్రితం లదాఖ్‌లోని లేహ్‌లో జరిగిన యుసిఐ ఎలిమినేటర్ ప్రపంచ కప్‌లో ఎలైట్ మహిళల విభాగంలో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించడం గర్వంగా అనిపించింది.

■ శక్తిని గుర్తించాలి..

నా కూతురికి ఇప్పుడు తొమ్మిదేళ్లు. ఆమె కూడా క్రీడల్లో చురుకుగా పాల్గొనాలని కోరుకుంటున్నాను. అందుకు ట్రెనింగ్ కూడా ఇప్పిస్తున్నాను. చదువుతోపాటు టాలెంట్‌ను కూడా గుర్తించి, దానిని మెరుగుపరుచుకునే ప్రయత్నం చేయాలని అమ్మాయిలకు చెబుతుంటాను. ఈ నెల పదిన జరిగే రేస్‌లో పాల్గొంటున్నాను. గెలుపు – ఓటమి, విజయం – అపజయం అని చింతించకుండా 100 శాతం శక్తినీ, సామర్థ్యాన్నీ వినియోగించి లక్ష్యాన్ని సాధించి, ఫలితాన్ని భగవంతునికే వదిలేయాలి. ఇంకో విషయం.. ఏదైనా కొత్తగా చేయడానికి వయసుతో సంబంధం లేదు. ఏ వయసులోనైనా విజయం సాధించవచ్చు. మీకుండాల్సింది ధైర్యం మాత్రమే'' అంటుంది ఇందు.

స్ఫూర్తి

పరీక్షల సీజన్ వస్తే రమా పద్మనాభన్ ఇంటి వ్యవహారాలను పెద్దగా పట్టించుకోదు. పెళ్లిళ్లు, ప్రయాణాలు అసలే ఉండవు. ఆమె తనకు వచ్చే కాల్స్‌ను అటెండ్ చేసే పనిలో ఉంటుంది. 'అక్కా.. ఈ ఎగ్జామ్ రాయాలి' 'ఆంటీ... ఈ డేట్‌న ఎంట్రన్స్ ఉంది' ఇలా దివ్యాంగులు ఆమెకు కాల్స్ చేస్తుంటారు. వారి కోసం ఆమె పరీక్ష హాల్‌కు వెళ్లి వారి ఆన్సర్స్‌ను రాసి పెడుతుంటుంది. 'ఇది గొప్ప తృప్తినిచ్చే సేవ' అంటోందామె.


ఓ దివ్యాంగుడికి పరీక్ష రాసిపెడుతున్న రమా పద్మనాభన్

పరీక్షా కాలంలో పలికే చేయి

చదువుకునే రోజుల్లో ఎవరైనా పరీక్షలు రాయవచ్చు. చదువు అయిపోయాక ఏవైనా కోర్సులు సరదాగా చదివితే పరీక్షలు రాయవచ్చు. కాని రమా పద్మనాభన్ అలా కాదు. ఆమె ప్రతి ఆరు నెలలకు విద్యార్థులకు సెమిస్టర్ ఎగ్జామ్స్ జరిగినప్పుడల్లా 50 పరీక్షలు రాస్తుంది. అంటే రాసి పెడుతుంది. గత పదకొండేళ్లుగా ఆమె అలా చేస్తూనే ఉంది. దివ్యాంగులకు పరీక్షలు రాసి పెట్టే స్క్రయిబ్‌గా ఆమెకు కోయంబత్తూరులో ఉండే పేరు అలాంటిది.

గృహిణిగా ఉంటూ...

కోయంబత్తూరుకు చెందిన రమా పద్మనాభన్ సైకాలజీలో డిగ్రీ చేసింది. ఆ తర్వాత 'గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్'లో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా కూడా చదివింది. భర్త ఫైనాన్షియల్ సెక్టార్‌లో పని చేస్తాడు. ఆమెకు ఇద్దరు అబ్బాయిలు. గృహిణిగా పిల్లలను చూసుకుంటూ కాలం గడుపుతున్న రమా పద్మనాభన్ జీవితం 2013లో మారింది. 'ఆ రోజు నేను యోగా క్లాసుకు బయలుదేరాను. నా స్నేహితురాలి నుంచి 'ఒక అంధ విద్యార్థికి పరీక్ష రాసి పెడతావా?' అనే విన్నపం వచ్చింది. అలా రాయగలనా అనుకున్నాను. పరీక్ష కేంద్రం దగ్గరే కనుక ట్రై చేద్దామనిపించింది. వెళ్లి రాసి పెట్టాను. పరీక్ష ముగిశాక ఆ అంధ విద్యార్థి ముఖంలో కనిపించిన కృతజ్ఞత నాకు ఎంతో మనశ్శాంతిని ఇచ్చింది. ఆ తర్వాత నాకు కాల్స్ రావడం మొదలైంది. కోయంబత్తూరులో లూయిస్ బ్రెయిలీ అకాడెమీ ఉంది. వాళ్లు కాల్ చేస్తూనే ఉంటారు. వీరు కాకుండా దివ్యాంగులు, ఆటిజమ్ విద్యార్థులు... వీరు పెన్ పట్టి పరీక్ష రాయడం కష్టం. వారికి పరీక్షలు రాసి పెడుతుంటాను' అని తెలిపింది రమా పద్మనాభన్.



అంతా ఉచితమే

దివ్యాంగులకు, అంధులకు పరీక్షలు రాసేందుకు రమ ఎటువంటి రుసుమూ తీసుకోదు. పరీక్షా కేంద్రానికి కూడా సొంత ఖర్చులతోనే వెళ్లి వస్తుంది. 'అయితే అందుకు నా భర్తను అభినందించాలి. నీ డబ్బులు ఖర్చు పెట్టి వేరొకరి పరీక్షలు ఎందుకు రాస్తున్నావు అని ఎప్పుడూ అడగలేదు' అంటుంది రమ. 'అంధ విద్యార్థులు తమకు పరీక్షలు రాసి పెట్టే వారు లేరని తెలిస్తే చాలా టెన్షన్ పడతారు. ఆబ్సెంట్ అయితే పరీక్ష పోతుంది. అందుకే వారికి స్క్రయిబ్‌లు కావాలి. వారు చెబుతుంటే జవాబులు సరిగ్గా రాయగలగాలి. నేను ఆటిజమ్ విద్యార్థులకు రాసి పెట్టేటప్పుడు మరింత శ్రద్ధగా ఉంటాను. వారు సమాధానాలు కంటిన్యూస్‌గా చెప్పడంలో ఇబ్బంది పడతారు. ప్రోత్సహిస్తూ రాబట్టాలి. అదే కాదు హైస్కూల్ పాఠాల దగ్గరి నుంచి ఇంజినీరింగ్ పాఠాల వరకూ అవగాహన ఉండాలి. అందుకే ఆ పాఠాలు కూడా తెలుసుకుంటూ ఉంటాను. స్క్రయిబ్‌గా నేను మారేటప్పటికి నా పిల్లలు చిన్నవాళ్లు. నా చిన్నకొడుకుకైతే ఐదారేళ్లవాడు. ఇంటిదగ్గర వాణ్ణి ఒక్కణ్ణే వదిలి తాళం వేసుకుని పరీక్ష రాసి పెట్టిన సందర్భాలున్నాయి' అని తెలిపిందామె.

కొనసాగే అనుబంధం

'నేను రాసిన పరీక్షలతో కోర్సులు పాసై ఉద్యోగాలు పొందిన దివ్యాంగులు చాలా మంది ఉన్నారు. వాళ్లంతా నా కాంటాక్ట్‌లో ఉంటారు. తమ జీవితంలో సాధిస్తున్న ప్రగతిని తెలియజేస్తుంటారు. అదంతా వింటుంటే ఎంతో సంతృప్తిగా అనిపిస్తుంది. జీవితానికి ఒక అర్థం దొరికినట్టు ఉంటుంది. నా పెద్దకొడుకు సీనియర్ ఇంటర్‌కు వచ్చాడు. వాణ్ణి వీలున్నప్పుడల్లా స్క్రయిబ్‌గా పని చేయడానికి పంపుతున్నా. వాడు ఆ పని చేస్తున్నందుకు ఎంత సంతోషపడుతున్నాడో చెప్పలేను' అని ముగించింది రమా పద్మనాభన్.

విద్యాప్రమాణాలు మెరుగుపడడం, కొత్త రంగాలు ఉనికిలోకి రావడం వల్ల 'ఉద్యోగమే సర్వస్వం' 'ఉద్యోగం దొరికితే చాలు' అనుకోవడం లేదు యువతరంలో చాలామంది. దీనికి కారణం...ప్రత్యామ్నాయ అవకాశాలు. 'ఉద్యోగం ఎందుకు చేయాలి?' నుంచి 'చేస్తే ఎలాంటి ఉద్యోగం చేయాలి' వరకు కెరీర్ బాట పట్టడానికి ముందు రకరకాల కోణాలలో ఆలోచిస్తున్నారు. మంచి వేతనం కంటే మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తున్నారు.

యూత్ పల్స్

నవతరం... ఉద్యోగ పర్వం



44 దేశాల్లో మిలీనియల్స్, జెన్ జెడ్‌పై సర్వే చేసింది డెలాయిట్. దీని ప్రకారం ప్రైమరీ జాబ్‌తోపాటు మరో జాబ్ చేస్తున్న యువ ఉద్యోగుల సంఖ్య తక్కువేమీ కాదు. బెంగళూరులో ఒక ప్రైవేట్ కాలేజీలో పని చేస్తున్న పరిమళ ఆన్‌లైన్‌లో వ్యాపారం కూడా చేస్తుంటుంది.

'డబ్బు కోసం కాదు. అదొక ప్యాషన్' అంటుంది తన ఆన్‌లైన్ వ్యాపారం గురించి.

లింక్డ్ ఇన్ సర్వే ప్రకారం 2023లో మన దేశంలో 88 శాతం మంది జెన్ జెడ్ ఉద్యోగులు 'ఉద్యోగ మార్పు'నకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. జెన్ జెడ్ ఉద్యోగులపై ఆర్పీజీ గ్రూప్ నిర్వహించిన ఒక సర్వే ప్రకారం పదిమందిలో ఆరుగురు మంచి వేతనం కంటే మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇచ్చారు.

'పని ఒత్తిడి చచ్చినట్లు భరించాల్సిందే' అని రాజీ పడడం కంటే 'జీతం తక్కువ అయినా సరే నాకు నచ్చిన ఉద్యోగం చేస్తాను' అని ఆలోచిస్తున్న వారి సంఖ్య యువతరంలో ఎక్కువగానే ఉంది.

ముంబైలోని ఒక మల్టీ నేషనల్ కంపెనీలో ఉద్యోగం చేసిన అనన్యకు పనిభారంతో ఊపిరాడేది కాదు. ఒక ఫైన్ మార్నింగ్ 'ఇది కాదు జీవితం' అనిపించింది. తన ఉద్యోగానికి రాజీనామా చేసి ఒక స్వచ్ఛంద సంస్థలో పనిచేస్తోంది. 'నేను పని చేస్తున్న కంపెనీతో పోల్చితే ఇది చాలా చిన్న ఉద్యోగం కావచ్చు. కాని ఎంతో సంతోషంగా ఉంది' అంటుంది అనన్య.

ఒక మార్కెటింగ్ సంస్థలో ఉద్యోగం చేసిన ఇరవై సంవత్సరాల సారా బోహ్రా ఆ ఉద్యోగం మానేసి సొంతంగా మార్కెటింగ్ ఫర్మ్ మొదలుపెట్టింది. వర్క్ ఫ్రమ్ హోమ్‌కు ప్రాధాన్యత ఇస్తోంది. 'ఇప్పుడు చాలా సౌకర్యంగా ఫీలవుతున్నాను. పని ప్రకారం కాదు గంటల ఆధారంగా ప్రొడక్టివిటీని కంపెనీలు అంచనా వేస్తున్నాయి' అంటుంది సారా.

బెస్ట్ ప్లాన్ బెడిసి కొడితే?

'ఈ రంగంలో మాత్రమే పనిచేస్తాను అని నేను ఎప్పుడూ అనుకోలేదు. ఏ రంగంలో పని చేయడానికైనా సిద్ధంగా ఉన్నాను. యాంత్రిక జీవితం కంటే ఉల్లాసకరమైన మార్పు చాలామంచిది' అంటుంది చెన్నైకి చెందిన శ్రీతేజ.

కోల్‌కత్తాకు చెందిన 23 సంవత్సరాల మనీష తన ఉద్యోగానికి సంబంధించి ఇప్పటికీ మూడు రంగాలు మారింది. అలా అని ఆమెలో పశ్చాత్తాపం ఏమీ లేదు.

'ఏ రంగంలో అయినా పనిచేయగలను అనే నమ్మకం వచ్చింది' అంటుంది మనీష.

వర్క్ నుంచి గ్యాప్ తీసుకోవాలనుకునే యువతరం కోసం ఈమధ్య కాలంలో ఎన్నో 'గ్యాప్ ఇయర్ కమ్యూనిటీస్' వచ్చాయి. 'గ్యాప్ ఎక్స్' పేరుతో హరియాణాలోని అశోకా యూనివర్శిటీలో 40 మంది స్టూడెంట్స్‌తో కూడిన గ్రూప్ ఉంది.

'యువతలో చాలామంది కెరీర్ మార్గాన్ని నిర్ణయించుకునే ముందు వివిధ అవకాశాల గురించి అన్వేషిస్తున్నారు. ఆలోచిస్తున్నారు' అంటున్నాడు దిల్లీ యూనివర్శిటీ మాజీ వైస్ చాన్సలర్ దినేష్ సింగ్.

చేస్తున్న ఉద్యోగాన్ని మానేసి నచ్చిన ఉద్యోగం చేయడం, సొంతంగా కంపెనీ మొదలుపెట్టడం, ఉద్యోగ విరామం తీసుకొని ఆన్‌లైన్ కోర్సులలో చేరడం వరకు తమదైన దారిలో ప్రయాణం చేస్తోంది నవతరం.

తీయటి పాఠాలు

రాజస్థాన్‌లోని వనస్థలి యూనివర్శిటీలో బీబీఏ డిగ్రీ పూర్తి చేసిన అనువ కక్కర్ ఉద్యోగం కంటే సొంత స్టార్టప్‌కే ప్రాధాన్యత ఇచ్చింది. అయితే కస్టమైజ్డ్ పోస్టర్ కార్డ్‌లకు సంబంధించి ఆన్‌లైన్ బిజినెస్‌లో ఫెయిల్ అయింది. అయితే ఈ ఫెయిల్యూర్ నుంచి పాఠాలు నేర్చుకున్న అనువ 'టిగెల్' చాకోలెట్ బ్రాండ్‌తో సక్సెస్ అయింది. హాట్ చాక్లెట్+వింటర్= హ్యాపీనెస్ నినాదంతో చిన్న బడ్జెట్‌లో కంపెనీ మొదలు పెట్టింది. కస్టమర్ చాయిస్‌లను అర్థం చేసుకోవడంలో పట్టు సాధించింది. 'టిగెల్' స్టార్ట్ చేసినప్పుడు అనువ వయసు 21 సంవత్సరాలు. 'చిన్న వయసులో ఎంటర్‌ప్రెన్యూర్‌గా ప్రస్థానం మొదలు పెట్టడం వల్ల ఎన్నో విషయాలు తెలుసుకోవడానికి అవకాశం ఉంటుంది' అంటుంది అనువ కక్కర్.



రంగుల ప్రపంచానికి ఆవల...

● సోషల్ యాక్టివిస్ట్ ● ఫ్యాషన్ డిజైనర్ ● రైటర్ ● మోటివేషనల్ స్పీకర్

అదర్ సైడ్

కరీనా కపూర్ అనగానే రంగుల ప్రపంచం కళ్ల ముందు ఆవిష్కారం అవుతుంది. అయితే ఈ అందాల నటికి మరో ప్రపంచం కూడా తెలుసు. స్త్రీ సాధికారత నుంచి మెన్‌స్ట్రువల్ హైజీన్ వరకు ఎన్నో అవగాహన కార్యక్రమాల్లో పాల్గొంటోంది. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా దేశ వ్యాప్తంగా ఎన్నో ప్రాంతాలకు వెళుతోంది. పేదింటి బిడ్డలతో మాట్లాడుతోంది. తాజాగా యూనిసెఫ్ ఇండియా నేషనల్ అంబాసిడర్‌గా నియామకం అయిన కరీనా కపూర్‌లో ఫ్యాషన్ డిజైనర్, రైటర్, మోటివేషనల్ స్పీకర్, సోషల్ యాక్టివిస్ట్ ఉన్నారు...


కరీనా కపూర్

ఉత్తమనటిగా సుపరిచితమైన కరీనా కపూర్ సృజనాత్మకమైన డిజైనర్ కూడా. క్లాతింగ్ రిటైలర్ 'గ్లోబస్'తో కలిసి పనిచేసింది. న్యూట్రిషనిస్ట్ రుజుత దివాకర్‌తో కలిసి తీసుకు వచ్చిన 'డోంట్ లూజ్ యువర్ మైండ్, లూజ్ యువర్ వెయిట్' పుస్తకం అమ్మకాల్లో రికార్డ్ సృష్టించింది. కరీనా కపూర్ వాయిస్‌తో ఈ పుస్తకం ఆడియో బుక్‌గా రావడం మరో విశేషం. 'ది స్టైల్ డైరీ ఆఫ్ బాలీవుడ్ దివా' పేరుతో తన జ్ఞాపకాల పుస్తకాన్ని తీసుకువచ్చింది. అదితి షా భీమ్జానీతో కలసి ప్రెగ్నెన్సీపై రాసిన పుస్తకం కమర్షియల్‌గా సక్సెస్ అయింది. రుజుత దివాకర్‌తో కలిసి న్యూట్రిషన్‌కు సంబంధించి 'ది ఇండియన్ ఫుడ్ విజ్‌డమ్ అండ్ ది ఆర్ట్ ఆఫ్ ఈటింగ్ రైట్' డాక్యుమెంటరీపై పనిచేసింది.

ఉమెన్ ఎంపవర్‌మెంట్‌పై వచ్చిన 'గర్ల్ రైజింగ్' అనే డాక్యుమెంటరీ ఫీచర్ ఫిల్మ్‌కు వాయిస్–వోవర్ ఇచ్చింది.

ఒకవైపు సినిమాల్లో బిజీగా ఉన్నప్పటికీ... పిల్లల విద్య, మహిళల భద్రతకు సంబంధించిన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటోంది. మహిళలపై హింసను నిరోధించడానికి ఎన్‌డీ టీవి ప్రారంభించిన శక్తి క్యాంపెయిన్‌కు అంబాసిడర్‌గా పనిచేసింది. 2014 నుంచి బాలికల విద్యకు సంబంధించి యూనిసెఫ్‌తో కలిసి పనిచేయడం మొదలుపెట్టింది. రాజస్థాన్, మహారాష్ట్రలోని పాఠశాలలకు వెళ్లి అక్కడి విద్యార్థులతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యల గురించి తెలుసుకునేది. జాల్నా జిల్లాలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం నిర్వహించిన నిధుల సేకరణ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంది.

నిరుపేద పిల్లల చదువు కోసం షర్మిలా ఠాగూర్‌తో కలిసి ఎన్నో కార్యక్రమాలు నిర్వహించింది. చైల్డ్–ఫ్రెండ్లీ స్కూల్ అండ్ సిస్టమ్స్ (సీఎఫ్ఎస్ఎస్) ప్యాకేజీని లాంచ్ చేసింది. చత్తీస్‌ఘడ్‌లో చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ వీక్ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో బాగా చదివే పిల్లలు, పాఠాలు బాగా చెప్పే టీచర్‌లకు పురస్కారాలు అందజేసింది.

మెన్‌స్ట్రువల్ హైజీన్‌పై యూనిసెఫ్ లక్నోలో నిర్వహించిన సమావేశంలో ప్రసంగించింది. 'నవజాత శిశువులను కాపాడుకుందాం' పేరుతో కరీనా రాసిన వ్యాసానికి మంచి స్పందన వచ్చింది. నవజాత శిశువులు, తల్లుల క్వాలిటీ హెల్త్ కేర్‌కు సంబంధించి 'ఎవ్రీ చైల్డ్ అలైవ్' అనే క్యాంపెయిన్‌ను నిర్వహించింది. మదర్స్ డే సందర్భంగా యూనిసెఫ్ దిల్లీలో నిర్వహించిన సమావేశంలో కరీనా ప్రధాన వక్త.

ప్రకృతి వైపరీత్య బాధితుల కోసం, ఎన్నో స్వచ్ఛంద సేవా సంస్థల కోసం నిధుల సేకరణ కార్యక్రమాల్లో పాల్గొంది కరీన. పిల్లల రోగనిరోధక శక్తి పెరుగుదలకు సంబంధించిన అంశాలపై పనిచేసే స్వస్థ్ ఇమ్యునైజేషన్ ఇండియాకు బ్రాండ్ అంబాసిడర్‌గా పనిచేసింది.

తాజా విషయానికి వస్తే...'నేషనల్ అంబాసిడర్‌గా యూనిసెఫ్‌తో నా అనుబంధం కొనసాగడం గౌరవంగా భావిస్తున్నాను. పిల్లల చదువు, హక్కుల కోసం నా గొంతు వినిపిస్తాను' అంటుంది కరీనా కపూర్.

'కరీనా కపూర్ ఎక్స్‌లెంట్ కమ్యూనికేటర్' అని కితాబు ఇచ్చింది యూనిసెఫ్.

చిన్న విజయం చాలు... పెద్ద సంతోషానికి



సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో 'నేను ఎలా సాధించానంటే'లాంటి స్టోరీలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. రేస్ మొదలైంది. ఆ రేస్‌లో భాగంగా యువతరం ఒత్తిడిని ఎదుర్కొంటుంది. ఈ రేసులో మెంటల్ హెల్త్ అనేది వెనక్కి వెళ్లిపోయింది. రేస్ అనేది శాంతి, సంతోషాల కోసం ఉండాలి. విద్యార్థులు తమ మానసిక శాంతిపై ఎక్కువ దృష్టి పెట్టాలి. చిన్న విజయాన్ని కూడా పెద్ద విజయంగా భావించుకోవాలి. 'ఇదీ ఒక విజయమేనా!' అనుకున్నప్పుడు అసంతృప్తి ఉంటుంది. అసంతృప్తి నుంచి అశాంతి జనిస్తుంది.

– కరీనా కపూర్